సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 3 । మార్చి । 2023



వలంటీర్ల మానవత్వం

గ్రామ/వార్డు వలంటీర్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు అక్కడకు వెళ్లి మరీ పింఛన్ అందిస్తున్నారు.

8లో



కనకమ్మకు తులసిపూజ

విశాఖ: కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. పంచామృతాభిషేక సేవలో భక్తులు పాల్గొన్నారు.



నటనలో శిక్షణ

విశాఖ: బాలుర హాస్టల్లో విద్యార్థులకు నటనలో శిక్షణ ఇచ్చారు. వారు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటిక అలరించింది.

న్యూస్‌రీల్

నేడే అనంతుని కల్యాణం



పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుడి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం రాత్రి స్వామి కల్యాణం అంగరంగవైభవంగా జరగనుంది. కాగా.. గురువారం రాత్రి పుట్ట బంగారం తీసుకురావడంతో స్వామి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. ముందుగా కుంతీ మాధవస్వామి ఆలయంలోని చక్రపెరుమాళ్లను పల్లకీలో పాత నంత జరిగే ప్రదేశం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ నుంచి పట్టు బంగారాన్ని కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి తీసుకెళ్లి పాళికల్లో వేశారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

విశాఖ: సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న ఎర్నాకుళంలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరాల్సిన ఎర్నాకుళం-టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ 3.30 గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ నెల 5వ తేదీన ఉదయం ఆరు గంటలకు అలప్పుజలో బయలుదేరాల్సిన అలప్పుజ-ధన్‌బాద్(13352) ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

ఉచితంగా రాగి, ఉలవ విత్తనాలు



శిక్షణలో మాట్లాడుతున్న జేడీ మోహనరావు

మాకవరపాలెం: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ జేడీ మోహనరావు సూచించారు. తామరం రైతు భరోసా కేంద్రంలో అభ్యుదయ మహిళా రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకున్న భూమిలో కొంత విస్తీర్ణంలో చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. రాగి, ఉలవ విత్తనాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఆరోగ్య రీత్యా చిరుధాన్యాల సాగు చేపట్టాలన్నారు. అనంతరం మహిళలకు అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్యసుధ, ఏవోలు విజేత, తులసి, చిరంజీవి పాల్గొన్నారు.

బీసీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకులాల కన్వీనర్, నర్సీపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి మార్చి 5 నుంచి ఏప్రిల్ 4లోపు https:// mjpapbcwreis. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. బాలురకు అనకాపల్లిలో 80, నర్సీపట్నంలో 40 సీట్లు, బాలికలకు తానాంలో 80, చోడవరంలో 40 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు.

ఈ పంట నమోదుకు తుది గడువు రేపు

తుమ్మపాల : జిల్లాలో రబీ 2022-23 ఏడాదిలో ఈ-పంట నమోదుకు ఈ నెల 4వ తేదీతో గడువు ముగుస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు గురువారం తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 43,113 ఎకరాల రబీ పంటసాగుకు గాను 41,704 ఎకరాలకు ఈ-పంట నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు గురువారం తెలిపారు. అత్యధిక విస్తీర్ణంలో వరి, అపరాలు, నూనెగింజలు, కూరగాయలు పండిస్తున్నట్టు వెల్లడించారు. పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నావడ్డీ, పంట రుణాలు, పంట కొనుగోలుకు రైతులు అర్హత పొందాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరన్నారు. దీని కొరకు ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తక్షణమే తమ వివరాలను నమోదు చేసుకోవాలని, నమోదైన వివరాలను సరిచూసుకోవాలన్నారు. ఈ నెల 8 నుంచి 12 వరకు రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. 13 నుంచి 17 వరకు తమకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20న తుది జాబితా ప్రచురించనున్నట్టు వెల్లడించారు.

పెట్టుబడుల పండగ నేడే

పారిశ్రామికవర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 పెట్టుబడుల పండగ నేడు ప్రారంభం కానుంది. రూ.2 లక్షల కోట్ల వాస్తవ పెట్టుబడులు లక్ష్యంగా అధికారంలోకి వచ్చాక మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకునేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్తలు సదస్సుకు హాజరుకానున్నారు. అడ్వాంటేజ్ ఏపీ పేరుతో నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించనున్న పారిశ్రామికవేత్తలు ఎన్నో కీలక నిర్ణయాలు వెలువరించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.



సమ్మిట్ సభా వేదిక

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఏయూ మైదానం
- సమ్మిట్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- దిగ్గజ పారిశ్రామికవేత్తల హాజరుతో కీలక ముందడుగు
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఎగ్జిబిషన్

సాక్షి, విశాఖపట్నం : సుదీర్ఘమైన తీరప్రాంతం, విస్తృతమైన వనరులు.. ఎక్కడా లేని విధంగా ఇన్వెస్టర్ల ఫ్రెండ్లీ పాలసీతో పారిశ్రామికవేత్తలను రాష్ట్రం ఆకర్షిస్తున్న తరుణంలో.. ఏపీలో తమ పరిశ్రమల్ని విస్తరించేందుకు ఆహ్వానం పలుకుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జీఐఎస్-2023 సమ్మిట్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో విశాఖ వేదికగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కీలక ఎంవోయూలకు వేదికగా నిలవబోతోంది. 45 దేశాల ప్రతినిధులు, 35 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరుకానున్న సదస్సు కోసం ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఏయూ మైదానంలో సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. మిరుమిట్లు గొలిపే సభా వేదికపై



సభా ప్రాంగణంలో వివిధ దేశాల జాతీయ జెండాలు

సుమారు 30 మంది అతిథులు ఆసీనులు కానున్నారు. ప్రధాన వేదిక వద్ద నాలుగు వేల మంది ప్రతినిధులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి పక్కనే ఉన్న మిగిలిన హాల్స్‌లో 137కిపైగా స్టాళ్లతో ఎగ్జిబిషన్, 20కి పైగా బిజినెస్ సెషన్లు నిర్వహించనున్నారు. రెండు రోజుల సమ్మిట్‌కోసం ఇప్పటికే 15 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయంటే స్పందన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

చార్టర్డ్ ఫ్లైట్స్.. హెలికాప్టర్లు

సదస్సులో పాల్గొనేందుకు ముఖేష్ అంబానీ, కరణ్ అదానీ, కేఎం బిర్లా, మిట్టల్, బజాజ్, జీఎంఆర్ తదితర ప్రముఖ పారిశ్రామికవేత్తలు నేడు విశాఖకు చేరుకోనున్నారు. దాదాపు 25కి పైగా చార్టర్డ్ ఫ్లైట్స్ విశాఖలో సందడి చేయనున్నాయి. అదేవిధంగా.. కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తల్ని సమ్మిట్ జరుగుతున్న ఏయూ మైదానానికి తీసుకొచ్చేందుకు రెండు హెలికాప్టర్లను కూడా రెడీ చేశారు. వీటితో పాటు ఖరీదైన లగ్జరీ కార్లు సిద్ధంగా ఉన్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అమర్‌నాథ్, విడదల రజని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సదస్సును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023ని శుక్రవారం ఉదయం 10.15 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులు, వసతుల్ని పారిశ్రామిక ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రతి రంగానికి సంబంధించి మొత్తం 14 ఆడియో వీడియో విజువల్స్‌ని ప్రదర్శించనున్నారు. అనంతరం సంబంధిత శాఖ మంత్రులు ప్రసంగిస్తారు. కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో తొలిరోజు సదస్సు జరగనుంది. ఈ సదస్సు జరిగే రెండు రోజులు వివిధ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకోబోతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ అవకాశాలున్న 14 రంగాలను ప్రభుత్వం ఈ వేదికపై ప్రమోట్ చేస్తోంది. రెండు రోజుల పాటు పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయాన్నే వేదిక వద్దకు చేరుకొని సాయంత్రం వరకూ పారిశ్రామికవేత్తలతోనే ముఖాముఖి సమావేశాలు, ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న సదస్సు విజయవంతం కావాలని మంత్రులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, విశాఖ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకట కుమారి, పక్కన ఎంపీ సత్యవతి, మంత్రి విడదల రజని





వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

ముస్తాబైన విశాఖ



విద్యుత్ వెలుగుల్లో విశాఖ నగరం

సాక్షి, విశాఖపట్నం: పెట్టుబడుల పండగకు విశాఖ నగరం ముస్తాబైంది. దేశవిదేశాల నుంచి వస్తున్న అతిరథ మహారథులకు సాదరంగా స్వాగతం పలకడానికి సర్వాంగ సుందరంగా సింగారించుకుంది. నభూతో అన్న చందంగా వైజాగ్ ప్రత్యేక అందాలను సంతరించుకుంది. ఎక్కడ చూసినా పండగ వాతావరణమే కనిపిస్తోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్ర, శనివారాల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) జరగనుంది. సమ్మిట్ నిర్వహణ కోసం విశాలమైన మైదానంలో ఆరు జర్మన్ హ్యాంగర్స్ వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా 46 దేశాలకు చెందిన అతిరథ మహారథులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరంగా అలంకరించారు. ఓ పక్క రోడ్లు మెరుస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, డివైడర్లు సరికొత్త రంగులను పులుముకుని అందంగా అగుపిస్తున్నాయి. డివైడర్ల మధ్యలో మొక్కలు చల్లగాలులు వెదజల్లుతున్నాయి. విద్యుత్ స్తంభాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. బీచ్‌రోడ్డులో డిజిటల్ లైటింగ్ నుంచి వెలుగులు లేలేత కిరణాలను తలపించేలా ప్రసరిస్తున్నాయి. రోడ్ల పక్కన గోడలకు విశాఖ సంస్కృతిని తెలియజేస్తూ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కూడా నిగనిగలాడుతున్నాయి. విశాఖకు విచ్చేసే ప్రముఖుల హోర్డింగులు నగరంలో అనేక చోట్ల దర్శనమిస్తున్నాయి. ఇలా విశాఖ నగరం.. దేశ విదేశాల నుంచి అడుగిడుతున్న పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానం పలుకుతోంది.



ఆర్‌కే బీచ్‌లో విద్యుత్ కాంతుల్లో కొబ్బరిచెట్లు



కళకళలాడుతున్న విశాఖ నగరంలో ఓ కూడలి

ఉత్పాదనలో స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరు

ఉక్కునగరం: ఉత్పాదనలో ఈ ఏడాది ఫిబ్రవరిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరును కనబర్చిందని యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరిలో రోజుకు సగటున 15,004 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేసిందని.. రెండు ఫర్నేస్‌లు కలిపి ఇప్పటివరకు ఇదే అత్యుత్తమ ఉత్పాదన అని పేర్కొంది. బీఎఫ్-1 నుంచి 2,12,000 టన్నులు, బీఎఫ్-2 నుంచి 2,08,100 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి కూడా ప్లాంట్ ప్రారంభం నుంచి ఫిబ్రవరిలో సాధించిన అత్యుత్తమ పనితీరు అని వెల్లడించింది. అలాగే డబ్ల్యూఆర్‌ఎం-1 నుంచి 91,356 టన్నుల వైర్‌రాడ్‌ల ఉత్పత్తి, ఎస్‌బీఎం నుంచి 53,453 టన్నుల ఉత్పత్తి, డబ్ల్యూఆర్‌ఎం-2 నుంచి 56,722 టన్నుల వైర్‌రాడ్, స్ట్రక్చరల్ మిల్ నుంచి 48,853 టన్నుల స్ట్రక్చరల్ ఉత్పత్తి సాధించినట్లు పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ అద్భుత పనితీరు కనబర్చడంలో కృషి చేసిన సిబ్బందిని సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

స్వామీజీ గోపూజ



గోపూజ చేస్తున్న శంకరవిజయేంద్ర సరస్వతీ స్వామి

- నూకాంబికను దర్శించుకున్న కంచి కామకోటి పీఠాధిపతి

తుమ్మపాల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని కంచి కామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి స్వామి గురువారం దర్శించుకొని పూజలు చేశారు. 300 కేజీలతో తయారు చేసిన అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఆవిష్కరించి తొలిపూజ చేశారు. ఆలయ మండపంలో భక్తులను స్వామీజీ ఆశీర్వదించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. స్వామీజీని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నూకాంబిక అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఆవిష్కరించిన స్వామీజీ

నేడే కోనేటిరాయుని కల్యాణం



అశ్వవాహనంలో స్వామివారి తిరువీధి సేవ



పెండ్లి కావిడిని మాడ వీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

- ఉపమాకలో ఘనంగా ఏర్పాట్లు
- అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు

నక్కపల్లి: కోనేటిరాయుని కల్యాణానికి వేళయింది. ఉపమాక గరుడాద్రి పర్వతం మీద ఏకశిలపై వెలసిన లోకేశుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి తిరుకల్యాణానికి గురువారం రాత్రి అంకురార్పణ జరిగింది. స్వామివారి కల్యాణమండపంలో ఉభయ దేవేరులను ఉంచి, సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి ఉత్తర ఈశాన్య దిక్కు ప్రాంతానికి పుట్టమన్ను తెచ్చేందుకు తీసుకెళ్లారు. స్వామివారి కల్యాణానికి అందరూ ఆహ్వానితులేనంటూ గురువారం ఉదయం పెండ్లి కావిడిని ఉపమాక మాడ వీధుల్లో ఊరేగించారు.

ఆలయానికి చేరిన ఆభరణాలు

స్వామివారికి కోట్లాది రూపాయల విలువైన స్వర్ణాభరణాలు ఉన్నాయి. వజ్రాలు, వైఢూర్యాలు, కెంపులు, పచ్చల హారం, కాసులపేర్లు, మరకత మాణిక్యాలు, పగడాలు, కటిహస్తం, వజ్రాల కిరీటం, గొలుసులు.. ఇలా రకరకాల ఆభరణాలు ఉన్నాయి. వీటిని భద్రతా కారణాల రీత్యా విశాఖలోని ట్రెజరీలో భద్రపరుస్తారు. ప్రతి ఏటా కల్యాణోత్సవాలకు తీసుకువచ్చి ఐదు రోజులపాటు అలంకరించి తిరిగి ఖజానాకు చేరుస్తారు. గురువారం భారీ బందోబస్తు మధ్య వీటిని ఆలయానికి తీసుకువచ్చారు.

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 150వ కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. గిరిజాంబ కొండ దిగువన ఉన్న పుట్ట వద్ద పేరంటాలు, పెద్దల సమక్షంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు ఆరోగ్యం బాగుండకపోవడంతో అతని అన్నయ్య దొరబాబు కుమారుడు శ్రీరామ్, దేవస్థానం ఈవో శర్మ, టీటీడీ అర్చకుల సమక్షంలో వేడుకలు జరిగాయి. సన్నాయి మేళతాళాలు, డప్పులు, వాయిద్యాల నడుమ కొండపై నుంచి కొండ దిగువన ఉన్న పుట్ట వరకు ఊరేగింపుగా వచ్చి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

భీమునిపట్నం: ప్రతి పాఠాన్ని ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఉన్న గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ సీఈఓ రాకెల్ క్రాప్ అన్నారు. గురువారం ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోపాటు పెద్దల పట్ల గౌరవం ముఖ్యమన్నారు.

క్లుప్తంగా

ఆరుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

బుచ్చెయ్యపేట: మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరుగురు ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ షోకాజ్ నోటీసులు అందించారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు పాఠశాలలో పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. హాజరు పట్టికలను, పలు రికార్డులను, ఉపాధ్యాయులు పని తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల చదువు, మధ్యాహ్న భోజన పథకంపై ఉపాధ్యాయులకు పలు ప్రశ్నలు వేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్ పట్టివేత

మాకవరపాలెం : అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు ఒక పొక్లెయిన్‌ను గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. మండల కేంద్రంలోని పంట భూముల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గురువారం అనకాపల్లి మైన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో మూడు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు

తుమ్మపాల : రోడ్లపై తిరిగే అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లను ఏర్పాటుచేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.వీర్రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు వాహనాలకు వెనుక వైపు రిఫ్లెక్టివ్ టేపును తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. aprtacitizen. epragathi. org వెబ్‌సైట్ ద్వారా వాహన యాజమానులు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని, స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్, రిఫ్లెక్టివ్ టేపులు లేని వాహనాలపై మోటారు వాహన చట్టం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎంకు ఘన స్వాగతం


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

పెట్టుబడులకు విశాఖ అనుకూలం

- పల్సస్ సీఈవో శ్రీనుబాబు



సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషితో పరిశ్రమల స్థాపన, పెట్టుబడులకు విశాఖపట్నం అద్భుతమైన గమ్యస్థానంగా మారిందని పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) నేపథ్యంలో గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వ్యాపారాలు విస్తరించాలని, తమ సంస్థలు స్థాపించాలని ఎదురు చూస్తున్న పెట్టుబడిదారులకు జీఐఎస్ అద్భుతమైన వేదికన్నారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు రెండు వేలకుపైగా వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు సమ్మిట్‌లో పాల్గొనున్నారని తెలిపారు. విశాఖలో 50 వేలకు పైగా ఐటీ నిపుణులు, లక్షలాది మంది ఫార్మా, హెల్త్‌కేర్ నిపుణులు ఉన్నారని చెప్పారు. ఇటీవల జరిగిన గ్లోబల్ టెక్ సమ్మిట్, ఇప్పుడు జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో రాబోయే రెండేళ్లలో 5 లక్షల మంది ఐటీ, హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్ ప్రొఫెషనల్స్ అందుబాటులోకి వస్తారన్నారు. జీడీపీ పరంగా దేశంలో 9వ అతిపెద్ద నగరం విశాఖపట్నం అని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలతో విశాఖ పోటీ పడుతోందన్నారు. సీఎం కృషితో నగరంలో అనేక పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు, తయారీ యూనిట్లు, ఫార్మా, వైద్య పరికరాల తయారీ సంస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహణతో విశాఖ కీర్తి విశ్వవ్యాప్తం అవుతుందని వెల్లడించారు.

ఒక్కసారి లే అమ్మా.. మాట్లాడమ్మా..!

- కలచివేసిన చిన్నారుల దీనస్థితి
- తల్లి మృతి.. తండ్రి జైలుపాలు
- గాలిమానువీధిలో ఘటన


తల్లి మృతదేహం వద్ద దీనంగా చిన్నారులు


నిందితుడు రామచంద్రరావు

గూడెంకొత్తవీధి: అమ్మా ఒక్కసారి లేవమ్మా.. మాట్లాడమ్మా అంటూ ఆ ముగ్గురు చిన్నారులు కన్నతల్లి మృతదేహం వద్ద విలపించడం అందరి హృదయాలను పిండేసింది. మద్యం మత్తులో తండ్రి దురాగతం వారికి కన్నతల్లిని శాశ్వతంగా దూరం చేసింది. బుధవారం అర్ధరాత్రి మొండిగెడ్డ పంచాయతీ గాలిమానువీధి గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆ కుటుంబాన్ని తీవ్ర శోకంలో ముంచేసింది. గ్రామానికి చెందిన గబులంగి రామచంద్రరావు, ఒడిశా ప్రాంతానికి చెందిన ఒడిశా విజయ 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అన్యోన్యంగా సాగుతున్న వీరి దాంపత్య జీవితంలో మద్యం మహమ్మారి చిచ్చు రేపింది. కాఫీ గింజలు విక్రయించగా వచ్చిన సొమ్ము తనకు ఇమ్మని భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు నిరాకరించిన ఆమెను అతడు నాటుతుపాకీతో కాల్చేశాడు.

బిక్కుబిక్కుమని..

తల్లి మృతి చెందగా, తండ్రి జైలుపాలు కానుండటంతో ముగ్గురు సంతానం పరిస్థితి దయనీయంగా మారింది.

రాష్ట్రానికి దిగ్గజ పారిశ్రామికవేత్తలు

- ముఖేష్ అంబానీ, కుమార మంగళం బిర్లా, కరణ్ అదానీ రాక
- సంజీవ్ బజాజ్, అర్జున్ ఒబెరాయ్, పునీత్ దాల్మియా, నవీన్ జిందాల్ హాజరు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రాష్ట్ర పునర్విభజన తర్వాత మొదటిసారిగా దిగ్గజ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. గతంలో మూడు సార్లు వివిధ పేర్లతో పెట్టుబడుల సదస్సులను నిర్వహించిన చంద్రబాబు హయాంలో కేవలం కుమార మంగళం బిర్లా మినహా పెద్ద పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరుకాలేదు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మొదటిసారిగా ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)కు దిగ్గజ సంస్థలకు చెందిన పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరు కావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి అద్దం పడుతోంది.

అప్పట్లో ఏమార్చారు..

సన్‌రైజ్ ఏపీ, పెట్టుబడుల సదస్సులు.. ఇలా పేర్లు మార్చి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేసిన చంద్రబాబునాయుడు మూడేళ్ల పాటు షో చేశారు. చిన్న చిన్న కంపెనీలకు చెందిన ప్రతినిధులను తీసుకొచ్చి ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తలుగా పరిచయం చేస్తూ రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయంటూ ఊదరగొట్టారు. సదస్సులకు పేరున్న ఒకే ఒక్క దిగ్గజ పారిశ్రామికవేత్త వచ్చారంటే చంద్రబాబు నిర్వహించిన సదస్సుల స్థాయి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. 2017–18లో నిర్వహించిన సదస్సుకు ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థల చైర్మన్ కుమార మంగళం బిర్లా మాత్రమే వచ్చారు. బిర్లా మినహా పేరున్న పారిశ్రామికవేత్తలెవర్నీ చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి ఆహ్వానించలేకపోయింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా 34 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారు. ప్రపంచ బిలినియర్ల జాబితాలో చోటు దక్కించుకున్న ముఖేష్ అంబానీ, అదానీ గ్రూప్‌ల చైర్మన్ గౌతమ్ అదానీ కుమారుడు కరణ్ అదానీతోపాటు దిగ్గజ పారిశ్రామికవేత్తలైన కుమార మంగళం బిర్లా, సంజీవ్ బజాజ్, అర్జున్ ఒబెరాయ్, పునీత్ దాల్మియా, నవీన్ జిందాల్, టెస్లా కో ఫౌండర్ మార్టిన్, సుమిత్‌బిదానీ, జోష్ ఫాల్గర్, మసహిరో యమగుచ్చి, సజ్జన జిందాల్, నవీన్ జిందాల్, శ్రీనివాసన్, సుమంత్ సిన్హా తొలిసారిగా రాష్ట్రానికి, విశాఖకు వస్తున్నారు.

ఒప్పందాలకూ సై...!

గతంలో చంద్రబాబు హయాంలో సదస్సుకు హాజరైనప్పటికీ పెట్టుబడులు పెట్టేందుకు మాత్రం పెద్దగా ఆసక్తి చూపించ లేదు. ఇక దిగ్గజ పారిశ్రామిక సంస్థల నుంచి వారి ప్రతినిధులు మాత్రమే హాజరయ్యేవారు. ఈ సారి అందుకు భిన్నంగా సదస్సుకు పలువురు దిగ్గజ పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరయ్యేందుకు మొగ్గుచూపడం గమనార్హం. అంతేకాకుండా పెట్టుబడులు పెట్టేందుకు కూడా తమ ఆసక్తిని చూపుతూ అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

ఏపీ వైపు చూపు...!

ప్రధానంగా ఏపీలో ఉన్న అపారమైన సముద్రతీర ప్రాంతంతోపాటు దేశంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక కారిడార్లలో మూడు పారిశ్రామిక కారిడార్లు ఏపీలో ఉండటం బాగా కలిసివస్తోంది.



ఈ పారిశ్రామిక కారిడార్లల్లో భారీ ఎత్తున దాదాపు 48 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. అంతేకాకుండా ఆయా పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇక పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయడం, వారి రాయితీలను స్పష్టంగా ఒక తేదీని ప్రకటించి మరీ మంజూరు చేయడం పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. అంతేకాకుండా 2023 – 28 కాలానికి కొత్త పారిశ్రామిక పాలసీని ప్రభుత్వం తయారు చేస్తోంది. ఈ పాలసీలో పరిశ్రమల ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కసరత్తును ప్రభుత్వం చేస్తోంది. అందువల్లే దిగ్గజ సంస్థలు సైతం ఏపీ వైపునకు చూస్తున్నాయనే అభిప్రాయం పారిశ్రామికవర్గాల్లో వ్యక్తమవుతోంది.

వాటే బ్యూటీ

సీతమ్మధార (విశాఖ ఉత్తర)/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ వెలిగిపోతోంది. వైజాగ్ మెరిసిపోతోంది. విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నేపథ్యంలో నగరం సరికొత్త అందాలతో ఆవిష్కృతమైంది. ఆర్కే బీచ్‌లోని కొబ్బరి చెట్లకు విద్యుత్ లైట్లు అమర్చారు. దీంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నేవీ, పోలీసు అమరవీరుల విగ్రహాలూ మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. పర్యాటకులు ఈ అందాల మధ్య తడిసిముద్దవుతున్నారు. సెల్ఫీలు తీసుకుంటు సందడి చేస్తున్నారు. పర్యాటక ప్రాంతాల వివరాలు తెలిపేలా ఆర్కే బీచ్ వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం కావడంతో ప్రత్యామ్నాయంగా ఈ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.


విద్యుత్ కాంతులతో పోలీసు అమరవీరులు విగ్రహాలు

అగ్ని ప్రమాదంలో జీడి తోటలు దగ్ధం

చోడవరం రూరల్ : మండలంలోని ముద్దుర్తి కొత్త పల్లి గ్రామ సమీపంలోని కొండపైన ఉన్న జీడిమామిడి తోటలకు ప్రమాదవశాత్తూ నిప్పంటుకుంది. గురువారం రాత్రి సంభవించిన ప్రమాదంలో నాలుగు ఎకరాల్లోని జీడి మామిడి తోటలు మంటలకు కాలిపోయాయి. ఎం.కొత్తపల్లి గ్రామానికి నంబారు సత్యవతి, నంబారు ముసలినాయుడు, యలమంచిలి అమ్మతల్లినాయుడు మరో నలుగురికి చెందిన జీడిమామిడి తోటలు కాలిపోవడంతో ప్రమాద నష్టం సుమారు లక్షా 20వేల రూపాయల మేరకు ఉంటుందని అంచనా. ప్రమాద సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని సుదూరాన ఉన్న కొండపైకి ఎక్కి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

నేడు ఓడల సందర్శన

మహారాణిపేట: ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా, విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎఫ్‌వీ మత్స్య షికారి, ఎంఎఫ్‌వీ మత్స్యదర్శిని అనే రెండు ఓడల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ ఆరో నంబర్ జెట్టీ వద్ద ఉన్న ఓడల్లో ఉదయం 9.45 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ మెకానికల్ మెరైన్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, సాధారణ ప్రజలు ఓడలను సందర్శించవచ్చన్నారు. కోస్ట్‌గార్డు డీఐజీ యోగింధర్ ఢాకా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నక్కపల్లి : జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో గురువారం తెల్లవారు జామున లారీ ఢీకొనడంతో మహిళ మరణించింది. దేవవరం గ్రామానికి చెందిన పోలవరకు ముత్యాలమ్మ అనే మహిళ బుధవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వచ్చేసింది. తెల్లవారు జామున ఒడ్డిమెట్ట సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తుండగా తుని నుంచి నక్కపల్లి వైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు గోవిందు ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.


ముత్యాలమ్మ మృతదేహం

మూడు తాటాకిళ్లు దగ్ధం

నాతవరం : సరుగుడు గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. లోచల నాగరాజు, అదిరెడ్డి లక్ష్మి, సంగపల్లి కృష్ణ వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ సమయంలో నాగరాజు ఇంట్లో మొదటగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. పక్కపక్కనే మరో రెండు తాటాకిళ్లకు మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, వీఆర్వో బొత్స శ్రీనివాసు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్తి నష్టం రూ.మూడు లక్షలు వరకు ఉంటుందని వీఆర్వో పేర్కొన్నారు. విషయాన్ని తహసీల్దార్ కనకారావు దృష్టికి తీసుకువెళ్తున్నానన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ పరంగా ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీపీ తెలిపారు.

శభాష్ వలంటీర్


దేవరాపల్లి: కేజీహెచ్‌లో నూకాలమ్మకు నగదు అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

- విశాఖ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ


రావికమతం: అచ్చియ్యమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ లీలావతి


దేవరాపల్లి: విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో సన్నిబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గౌరి

దేవరాపల్లి/మునగపాక/రావికమతం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ మెరుగైన ఫలితాలిస్తోంది. వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు మెరుగైన సేవలందిస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దేవరాపల్లికి చెందిన దివ్యాంగురాలు ఉప్మాక నూకాలమ్మకు వలంటీర్ జ్యోతి పింఛన్ (రూ.3 వేలు) గురువారం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఉల్లి సన్నిబాబుకు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గ్రామ వలంటీర్ గౌరి పింఛన్ సొమ్ము ఇచ్చారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మునగపాక మండలం గణపర్తి గ్రామానికి చెందిన మడగల రమణకు వలంటీర్ చదరం లక్ష్మి పింఛన్ అందజేశారు. ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రావికమతం మండలం గంపవానిపాలేనికి చెందిన యాకా అచ్చియ్యమ్మకు గ్రామ వలంటీర్ రొంగల లీలావతి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించండి

- బార్ అసోసియేషన్ సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



న్యాయవాదులతో కలిసి కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని న్యాయవాదులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. చోడవరం బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం న్యాయవాదులకు అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ నెల 13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రకాషరావు, న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, ఉగ్గిన వెంకట్రావు, బాబి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

కోటవురట్ల : అక్రమంగా తరలిస్తున్న గంజాయి ఆటోను పట్టుకొని ప్రజలు పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని కన్నూరుపాలెంలో జరిగింది. రూ.లక్ష విలువైన 50 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి గురువారం అందించిన వివరాలివి. ఏటిగైరమ్మపేట నుంచి తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిని చేరుకోవడానికి బుధవారం రాత్రి వస్తున్న గంజాయితో వస్తున్న ఆటో కన్నూరుపాలెం వద్ద రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని ఢీకొనడంతో గాయపడ్డాడు. దీంతో ఆటోను స్థానికులు పట్టుకొని పరిశీలించగా దానిలో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్టు గుర్తించారు.

ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కాపారపు నాగరాజును పట్టుకొని అరెస్టు చేశారు. ఆటోలో తరలిస్తున్న 50 ప్యాకెట్ల గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆటోను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


గంజాయితో పట్టుబడిన ఆటో, డ్రైవర్ నాగరాజు, స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్

క్లుప్తంగా

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కాస్త పెరిగాయి. కిలో టమాటా గత వారం రూ.20 ఉండగా, ఈ వారం రూ.25కు పెరిగింది. క్యారెట్, బీట్‌రూట్ రూ.40 నుంచి రూ.60, బీరకాయ రూ.60 నుంచి రూ.80కి పెరిగాయి. ఎప్పటిలాగే ఉల్లిపాయలు, బంగాళాదుంపలు రూ.20, వంకాయలు రూ.40, కాకర, బెండకాయ, పచ్చి బఠానీ, దొండకాయ రూ.60, క్యాప్సికం, బీన్స్ కాయలు రూ.80కి అమ్మకాలు సాగాయి.

'స్కై స్పోర్ట్స్' వ్యాప్తికి కృషి



స్కై స్పోర్ట్స్ నూతన కార్యవర్గ సమావేశం

తుమ్మపాల : స్కై స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ క్రీడను జిల్లాలో అందుబాటులోకి తీసుకొస్తామని అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ వనం సన్యాసిరావు అన్నారు. అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో గురువారం నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్రీడను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో స్కై స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో అనేక చోట్ల ఉచిత క్రీడా శిబిరాలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కొత్తూరు రమేష్, ఎం.రాజు, జి.దేవి వరలక్ష్మి, రాజాన వెంకట నాగఅప్పారావు, కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవంలో బీజేపీ నేతలు



ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుతో సంబరాల్లో బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్ : బీజేపీ పాలనపై ప్రజలకు విశ్వాసముందనడానికి మూడురాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలే నిదర్శనమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో గురువారం రాత్రి పార్టీ నేతలు విజయోత్సవాలు జరిపారు. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడంతో పార్టీ నేతలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, నాయకులు ఏఆర్‌జీ శర్మ, కర్రి రామకృష్ణ, కొండబాబు మాస్టారు, కొణతాల అప్పలరాజు, వుడా రమేష్, నాగేశ్వరరావు, నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సినిమా	థియేటర్
సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
సాచి	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్ స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6,571 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,610	3,910
మొదటి రకం	3,400	3,640
రెండో రకం	3,130	3,490
మూడోరకం	3,030	3,120

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 307 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 493 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

తల్లీబిడ్డల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- మాతా శిశు సంరక్షణ కార్డుతో విస్తృత ప్రయోజనాలు
- గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు
- బిడ్డకు వేయాల్సిన టీకాల గురించి సమగ్ర సమాచారం

గర్భం దాల్చినట్టు తెలిసినప్పటి నుంచి ఆ కాబోయే తల్లిదండ్రులకు ఎన్నో అనుమానాలు. ఏం తినాలి.. ఏం తినకూడదు.. ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇలా ప్రతీదీ ఓ సందేహమే. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో అమ్మమ్మలు, నాన్నమ్మల భరోసా ఉండేది. భార్యాభర్తలిరువురే కుటుంబంగా మారిన రోజులివి. ఇలాంటి సమయంలో గర్భిణులకు, బాలింతలకు జగనన్న ప్రభుత్వమే అన్నీ తానై చూసుకుంటోంది. మాతా శిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డుతో విస్తృత ప్రయోజనాలు అందిస్తోంది.

అనకాపల్లి రూరల్ : మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఏయే వైద్య పరీక్షలు ఎప్పుడు చేయించుకోవాలి? సుఖ ప్రసవం అయ్యేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? గర్భిణులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి? బిడ్డ పుట్టాక వ్యాక్సిన్ల షెడ్యూల్ ఏంటి? ఇలా గర్భిణులు, బాలింతలకు చాలా సందేహాలు వస్తుంటాయి. తొలి సంతానం విషయంలోనైతే మరిన్ని భయాలు.. ఆందోళనలు ఆ భార్యాభర్తల్ని వేధిస్తుంటాయి. అందుకే ప్రభుత్వం ఇలాంటి వారికి కనీస అవగాహన కలిగేలా సమస్త వివరాలు తెలిపేలా మాతా శిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డులను అందిస్తోంది. కార్డు చిన్నదైనా దాని ప్రయోజనాలు అన్నీఇన్నీ కావని వైద్యనిపుణులు చెప్తున్నారు.

గర్భం దాల్చిన నుంచి ప్రభుత్వ సంరక్షణ

తల్లీ బిడ్డల సంరక్షణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. మాతా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త నిర్వహణలో తల్లీ బిడ్డల సంరక్షణే ధ్యేయంగా వ్యవహరిస్తోంది. గర్భం దాల్చిన రోజు నుంచి ప్రసవం, బాలింత, శిశువు సంరక్షణకు సంబంధించి అన్ని వివరాలు తల్లి చేతిలో ఉండేలా ఎంసీపీ కార్డులను ప్రభుత్వం ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఆరోగ్య ఉప కేంద్రాల్లో అందిస్తోంది. మహిళలు గర్భం దాల్చినప్పటినుంచి కాన్పు అయ్యేవరకూ ప్రభుత్వ వైద్యశాలలో నాలుగుసార్లు వైద్యసేవలు తప్పనిసరిగా చేయించుకోవాలి. వైద్య పరీక్షలకు వెళ్లే ప్రతిసారీ గర్భిణులు, బాలింతలు వైద్యాధికారులకు ఎంసీపీ కార్డులు చూపించాలి. వీటి ఆధారంగానే వారి వైద్య చరిత్రను తెలుసుకుంటారు. దీంతో మహిళలు, శిశువులు తమ ఆరోగ్యాన్ని ఈజీగా సంరక్షించుకోవచ్చు.

ఒకే కార్డు.. ఎన్నో ప్రయోజనాలు

గర్భం దాల్చిన నాటి నుంచి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, వారికిస్తున్న మందులు, బిడ్డ ఎదుగుదలను తెలిపే స్కానింగ్ వివరాలు, గర్భం దాల్చిన తేదీ, అంచనా ప్రసవ తేదీలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు ఇందులో పేర్కొంటారు. కాన్పు జరిగిన తర్వాత ఐదేళ్ల వయసు వరకూ చిన్నారులు ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా ఎప్పుడెప్పుడు ఏయే వ్యాక్సిన్లు వేయాలన్న సమస్త వివరాల్ని ఈ కార్డుల్లో నమోదు చేస్తారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి ప్రాథమిక లక్షణాలను ఇందులో పొందుపరచడం వలన వాటి బారిన పడకుండా, ఒకవేళ వచ్చినా తొలిదశలోనే గుర్తించి సరైన వైద్యం పొందేలా ఎంసీపీ కార్డులను రూపొందించారు. దీనితో పాటుగా ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన తదితర పథకాల ద్వారా ప్రభుత్వాస్పత్రిలో ప్రసవమైతే ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం వివరాలను సైతం ఈ కార్డుల్లో పొందుపరుస్తారు. దీంతో ఈ కార్డులు మహిళలకు బహుళ ప్రయోజనకరంగా ఉంటున్నాయి.



మాతా శిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డు



తగరంపూడి పీహెచ్‌సీలో గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

అనకాపల్లి అర్బన్, కశింకోట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
అనకాపల్లి అర్బన్	74	358	430	2,576
కశింకోట	91	1,265	1,187	8,633

ఎంసీపీ కార్డుతో ఎంతో మేలు



మాతా శిశు సంరక్షణ కార్డుల(ఎంసీపీ)తో ఎన్నో ప్రయోజనాలున్నాయి. తల్లి సంరక్షణతో పాటు బిడ్డకు ఐదేళ్లు వచ్చే వరకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్ల వివరాలుంటాయి. చిన్నారులకు విటమిన్–ఎ ద్రావణం కార్డులో సూచించిన విధంగా వేయించాల్సి ఉంటుంది. దీంతోపాటు బిడ్డ వయసు, ఎత్తు, బరువుల వివరాలు చార్ట్ రూపంలో ఉంటాయి. ఎదుగుదలలో ఏవైనా లోపాలుంటే తల్లి స్వయంగా గమనించి అవసరమైన వైద్యం పొందొచ్చు.

– డాక్టర్ జి.పావని, తగరంపూడి పీహెచ్‌సీ

సచివాలయంలో ఎంపీపీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : మండలంలోని ఊడేరు గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు సమయానికి హాజరవుతున్నదీ, లేనిదీ స్వయంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో ఎంపీడీవో కె.ధర్మారావు, మండల ఏఈ కుమార్‌రాజా, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మార్టూరు గ్రామంలో గురువారం నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పండగను సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనుబాబు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



ఘన జీవామృతం తయారీని పరిశీలిస్తున్న మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ



ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న కంది పంట

కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయం సాగించాలని, దీనివల్ల సాగు దిగుబడి బాగుంటుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని సుందరయ్యపేట శివారు ఆనందపురంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యకరమైన పంటలను అందించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు ప్రకృతి సిద్ధంగా తయారు చేస్తున్న ఎరువులను పరిశీలించారు. మండల ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డి.రమణ, ప్రతినిధులు కె.దేవి, డీవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజాసంఘాల నిరసన



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లిటౌన్ : కేంద్ర ప్రభుత్వం పేదవారి కడుపు కొట్టి పెద్దలకు దోచిపెడుతోందని ప్రజాసంఘాల నేతలు ఆరోపించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు గురువారం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజాసంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తీరు మార్చుకోకుంటే ప్రజల ఆగ్రహానికి గురి కాకతప్పదని హెచ్చరించారు. అంతకుముందు ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్, సూదికొండ మాణిక్యాలరావు, బండి అప్పారావు, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు, కిలాడి నూకరాజు, బొబ్బిలి గోవిందరాజు, కుండల రామకృష్ణ పాల్గొన్నారు.

5న తూర్పుకాపు సంఘ సమావేశం

అనకాపల్లిటౌన్ : తూర్పుకాపు వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని ఈ నెల 5న మండలంలోని సత్యనారాయణపురం హేమగిరి సత్యనారాయణస్వామి కొండ దిగువన నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు పలకా రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంఘ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు



కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి గురువారం తెలిపారు. వివరాలు.. కన్నూరుపాలెంలో రోడ్డు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కాండ్ర అప్పారావును బుధవారం రాత్రి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నారు. ఈ మేరకు భార్య దేవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

వైభవంగా వేంకటేశుని వార్షిక కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం శుక్లపక్ష ఏకాదశి పురస్కరించుకుని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పూలమాలలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించి, వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. మల్లపురెడ్డి కోటేశ్వరరావు, లీలావతి దంపతులు, మారిశెట్టి రాజాసతీష్, సుజాత దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని ఆద్యంతం భక్తిశ్రద్ధలతో తిలకించి తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, చింతల పాలెం సర్పంచ్ కొట్టి రాము, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, స్థానిక ప్రతినిధులు మజ్జి ప్రసాదరావు, కేవీవీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు మజ్జి సూర్యప్రకాశరావు, కర్రి దుర్గినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి



తుమ్మపాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దంతులూరి దిలీప్ కుమార్, పార్టీ నాయకులు



తాళ్లపాలెంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనకాపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ మద్దతు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ఓటర్లను కోరారు. గురువారం తుమ్మపాల మేజర్ పంచాయతీలో పార్టీ నేతలతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం మూడున్నరేళ్లలో ప్రజలకు చేసిన మేలును దృష్టిలో ఉంచుకుని సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ శ్రేణులంతా సుధాకర్ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వడ్డాది భారతీయ అశోక్, కల్యాణ్‌బాబు, ఉప సర్పంచ్ చదరం చిన్న, మగసాల లక్ష్మి, మగసాల వెంకట్, ఆర్టీసీ సత్యనారాయణ, పీలా బుజ్జి, పంచాయతీ వార్డు సభ్యులు తత్ర సత్యారావు, రామారావు, కొణతాల పెంటమ్మ, మాదిబోయిన నాగరాజు, సూరిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో వైఎస్సార్ సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ స్థానిక నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి పాఠశాలలు, ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, పార్టీ స్థానిక నాయకులు మట్టా సత్తిబాబు, గుమ్మడి శ్రీను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురువుల మాటే.. విద్యార్థులకు శిరోధార్యం కావాలి




స్వామీజీకి కామాక్షిదేవి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దాడి వీరభద్రరావు దంపతులు, రత్నాకర్

తుమ్మపాల : ఆధునిక విద్యలో గురువుల మాటే విద్యార్థులకు శిరోధార్యం కావాలని కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు స్వామిజీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు కుటుంబసమేతంగా మేళతాళాల మధ్య కళాశాలలోకి ఆహ్వానించారు. స్వామీజీకి వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు, కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కామాక్షిదేవి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాన్యసంఘవి, నేహాఅక్షయలకు పురస్కారాలు

అనకాపల్లిటౌన్ : బహుభాషా, నృత్య విభాగాల్లో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన అనకాపల్లి జిల్లాకు చెందిన మాన్యసంఘవి, కె.నేహాఅక్షయ విశిష్ట వనిత పురస్కారాలు అందుకోనున్నారు. ఈ మేరకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం హెచ్‌బీకాలనీ బ్రాంచ్ నిర్వాహకురాలు బీకే రామేశ్వరి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ డాబాగార్డెన్స్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో వీరికి పురస్కారాలు అందించనున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం



కశింకోట : మండలంలోని బయ్యవరంలో శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరపనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ, బాణసంచా కాల్చనున్నట్లు పేర్కొన్నారు.

6న పరదేశమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : రామారాయుడుపేటలో ఈ నెల 6న పరదేశమ్మతల్లి ఆలయ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరి సహకారంతో నిర్మించనున్న ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి గ్రామస్తులంతా తరలిరావాలని కోరారు.

అన్ని దారులూ ఉపమాక వైపే..

- వెంకన్న సన్నిధికి చేరుకుంటున్న భక్త జనం
- నేటి రాత్రికి జాతర, స్వామి కల్యాణం
- తెల్లవారుజాము 2 గంటల నుంచే దర్శనాలు

నక్కపల్లి: ఉపమాకలో జరిగే జాతరలో పాల్గొని వెంకన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్త జనకోటి తరలివస్తున్నారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా జరగనుంది. ఏకాదశి లగాయతు ఉగాది వరకు ఇక్కడ పెద్ద ఎత్తున జాతర (తీర్థం) జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు గురువారం సాయంత్రం నుంచే ఉపమాక చేరుకుంటున్నారు. ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు, షెడ్లు నిర్మించారు. వారం రోజుల పాటు టీటీడీ వారు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ప్రారంభంకానున్న జాతర శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులందరికీ ఏకాదశి రోజున వివిధ సేవా సంఘాలవారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి సత్య సాయి సేవాసమితి సభ్యులు భక్తులకు మంచి నీరు, మజ్జిగ సరఫరా చేయనున్నారు.



ఆలయంలో భక్తుల దర్శనాల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

జల్లికట్టు స్నానానికి ఏర్పాట్లు


బందుర సరస్సు వద్ద స్నాన ఘట్టాలు, మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారి పుష్కరిణిలో జల్లికట్టు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు చెరువు లోపలికి వెళ్లకుండా 50 అడుగులమేర రేకుతో ఫెన్సింగ్ వేశారు. ఈ మధ్యలోనే భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లు సిద్ధం చేశారు.

భారీ బందోబస్తు

ఉపమాక వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆలయం వద్ద బందోబస్తు విధుల కోసం వచ్చిన పోలీసు సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవ్‌టీజింగ్, దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వామి వారికి ఆభరణాలు అలంకరించి తిరువీధి సేవలు రథోత్సవం, ఎదురు సన్నాహ మహోత్సావాలకు తీసుకెళ్లే సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐలు నారాయణరావు, గణేష్, ఎస్‌ఐ శిరీష పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్



పుష్కరిణి వద్ద జల్లికట్టు స్నానాల కోసం చేసిన ఏర్పాట్లు

ప్రశాంతంగా ముగిసిన మండల సమావేశం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో జరుగుతున్న అభివృద్ధి గురించి విభాగాల వారీగా ఆరా తీశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త నిధులు, నూతన పథకాల అంశాల జోలికి వెళ్లకుండా జరుగుతున్న అభివృద్ధి పైనే చర్చించారు. ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.